శిథిల గోదాములకు మోక్షమెప్పుడో?



శిథిలావస్థలో ఉన్న జీసీసీ గోదాం



పూర్తిగా పాడైన గోదాం గచ్చు



పాడైన గోడౌన్ గోడలు



గోడౌన్ భవనం కారిపోతుండడంతో సరుకులపై కప్పిన టార్పాలిన్

- శిథిలావస్థలో జీసీసీ గోడౌన్లు
- ప్రమాద భరితంగా ఉన్న గోడలు, పాడైన పైకప్పు
- నిత్యావసర సరుకుల నిల్వలో అవస్థలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఉన్న మూడు జీసీసీ గోదాముల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి.బీటలు వారిన గోడలు,పాడైన పైకప్పు,తలుపులు, పెచ్చులూడినగచ్చుతో దర్శనమిస్తున్నాయి.మండలంలో 23 పంచాయతీల్లో డీఆర్ డిపోలు,అంగన్‌వాడీ కేంద్రాలకు,ఆశ్రమ పాఠశాలలకు పంపిణీ చేసే బియ్యం,నిత్యావసర సరుకులు నిల్వ చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవనాల పూర్తిగా పాడవంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని జీసీసీ సిబ్బంది భయపడుతూ విధులు నిర్వహిస్తున్నారు.1970 సంవత్సరంలో భవనాలు నిర్మించారు.నేటికీ అవే భవనాలను సరుకుల నిల్వకు వినియోగించుకోవాల్సిన పరిస్థితి.భవనాల్లో గచ్చు పాడవడంతో మట్టి దర్శనమిస్తోంది.దీనికితోడు పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడి,ఎలుకలకు నిలయంగా మారాయి.బియ్యం,కందిపప్పు,పంచదార వంటి సరుకులను ఎలుకలు పాడుచేస్తున్నాయి.సరుకులను కాపాడుకునేందుకు జీసీసీ సిబ్బంది అవస్థలు పడుతున్నారు. 2022 సంవత్సరంలో భారీ వర్షాలకు ఒక గోదాము గోడలు తడిచిపోయి,పాడిపోయాయి.కొన్ని నెలల పాటు టార్పాలిన్లు అడ్డుపెట్టి సరుకులను కాపాడుతూ వచ్చారు.తరువాత తాత్కాలికగోడ నిర్మించారు.పలుమార్లు గోదాముల భవనాల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది.

సరుకుల నిల్వకు తప్పని పాట్లు

జీసీసీ గోదాములు పాడైపోవడంతో సరుకుల నిల్వకు సిబ్బందికి పాట్లు తప్పడం లేదు.మూడు భవనాల్లో ఒకటి పూర్తిగా శిథిలంకాగా, మిగతా రెండు భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఒక గోడౌన్‌లో 250 మెట్రిక్ టన్నుల సరుకులు నిల్వ ఉంచుకోవచ్చును.రెండు భవనాల్లో 5,000 మెట్రిక్ టన్నులు నిల్వకు ఉపయోగిస్తున్నారు.ప్రతి నెల 46 డిపోలకు చెందిన 14,230 మంది రేషన్‌దారులకు, 12ఆశ్రమ పాఠశాలకు,రెండు కళాశాలల వసతి గృహాలకు,ఒక కేజీబీవీతో పాటు 229 అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసే సరుకులు నిల్వ ఉంచాలి. బియ్యం,కందిపప్పు,బెల్లం, రాగిపిడి,పంచదార, చింతపండు,ఉప్పు,నూనె,పసుపు,సబ్బులు వంటి సరుకులనుఈ గోడౌన్ల నుంచి సరఫరా చేయాలి. కొన్ని సందర్భాల్లో సరుకులు ఎలుకల బారినపడి నేలపాలవుతున్నాయి. వర్షాలకు కారిపోతూ ఉండడంతో ప్రసుత్తం సరుకులపై టార్పాలిన్లు కప్పి కాపాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.తడిచిపోయి సరుకులు పాడైతే ఆ నష్టాలను గోడౌన్ల ఇన్‌చార్జిలు భరించాల్సి వస్తోంది.ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి జీసీసీ గోదాములకు నూతన భవనాలకు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

జీసీసీ గోడౌన్లు భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో సరుకుల నిల్వకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. శిథిల భవనాల పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.నిధులు మంజూరైతే భవనాల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– వి.కుమారస్వామి,
జీసీసీ మేనేజర్, ముంచంగిపుట్టు

క్లుప్తంగా

పరిహారం చెల్లించిన తరువాతనే విస్తరణ పనులు చేపట్టాలి

గూడెంకొత్తవీధి: కాఫీ రైతులకు పరిహారం చెల్లించిన తరవాతనే జాతీయ రహదారి 516ఈ విస్తరణ పనులు చేపట్టాలని పెదవలస పంచాయతీకి చెందిన రైతులు కలెక్టర్ దినేష్‌కుమార్‌ను శుక్రవారం కోరారు.పెదవలస నుంచి చాపరాలిపాలెం వరకు వందలాది ఎకరాల్లో కాఫీ తోటలు రోడ్డు విస్తరణ వల్ల పోతున్నాయన్నారు. ముందుగా పరిహారం చెల్లించాలని, ఆ తర్వాతే పనులు చేపట్టాలన్నారు. కలెక్టర్ తక్షణం స్పందించాలని వారు కోరారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు



డీపీవోకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రామకృష్ణ, వార్డు సభ్యులు

జి.మాడుగుల: మండలంలో పాలమామిడి పంచాయతీలో గతంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి మైదాన ప్రాంతాలకు చెందిన ఇద్దరి జనన ధ్రువీకరణ పత్రాలను ప్రస్తుతం పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శి జారీ చేశారని స్థానిక సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ,వార్డు సభ్యులు ఆరోపించారు.స్థానిక విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడారు. కార్యదర్శిగా పని చేసి బదిలీపై వెళ్లిన జె.అచ్చింనాయుడు డిజిటల్ సంతకం ఫోర్జరీ చేసి ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కొల్లాన చిన్నంనాయుడు ఈ జిల్లాకు సంబంధించిన వారు కాకపోయినా వారి వద్ద నుంచి అధిక మొత్తంలో నగదు తీసుకొని జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారని వారు ఆరోపించారు. అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కొంతలం, మునకపాక మండలం తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన వారికి ధ్రువీకరణపత్రాలు జారీ చేశారని చెప్పారు. వారిలో ఒకరు పంచాయతీ కార్యదర్శి చిన్నంనాయుడుకు మేనమామ ఊడి నానాజీ అని, ఆయనకు సంతానమే లేదని తెలిసిందన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న పంచాయతీ కార్యదర్శి చిన్నంనాయుడుపై కలెక్టర్, డీపీవోలకు,స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు. సమగ్ర విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

సబ్సిడీపై రాజ్‌మా విత్తనాల పంపిణీ



రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ అప్పలరాజు, ఎస్‌ఐ షణ్ముఖరావు

జి.మాడుగుల: గంజాయి సాగుకు స్వస్తి పలికి సంప్రదాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని ఎంపీపీ లొంబోరి అప్పలరాజు, ఎస్‌ఐ షణ్ముఖరావు, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.వరప్రసాద్, వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ తెలిపారు.స్థానిక మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం 90శాతం సబ్సిడీపై రాజ్‌మావిత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మత్స్యరాస విజయకుమారి, సర్పంచ్ కిముడు రాంబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కె.వి. ప్రసాద్,మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు లకే బాలయ్యదొర,యూత్ నాయకులు నారాయణరాజు, భీంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాల కోసం ఆందోళన



చింతూరు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

చింతూరు: పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, రూ. 21 వేలు కనీస వేతనం ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం చింతూరు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులతో పాటు గ్రీన్ అంబాసిడర్లకు ఐదునెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, 551 జీవో అమలుచేసి గుర్తింపుకార్డులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయాలని కోరారు. రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరుతూ కార్యదర్శి గంగరాజుకు వినతిపత్రం అందచేశారు. సీసం సురేష్, మొట్టుం రాజయ్య, నాగేష్, రాజమ్మ, రాములమ్మ, శారద, వెంకమ్మ, దుర్గ, మూర్తి, నాగరాజు పాల్గొన్నారు.

కాయతొలుచు పురుగు నివారణపై అవగాహన



పురుగు సోకిన కాఫీ గింజలు సేకరించిన గిరిరైతులు, అధికారులు

అరకులోయటౌన్: మండలంలోని చినలబుడు పంచాయతీ పకనకుడి గ్రామంలో కాఫీ తోటలకు సోకిన కాయతొలుచు (బెర్రీబోర) పురుగు నివారణపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. గ్రామంలో కాఫీ తోటలను సందర్శించి, పురుగు నివారణకు తీసుకోవలసిన చర్యల గురించి వివరించినట్టు పాడేరు కాఫీ బోర్డు ఏడీ లకే బొంజుబాబు తెలిపారు. 100 డిగ్రీల వేడినీటిలో కాయలను ముంచి పురుగును నాశనం చేసే విధానాన్ని కాఫీ రైతులకు వివరించినట్టు చెప్పారు. ఈ పురుగు సోకకుండా ఉండేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాఫీ బోర్డు జేఎల్‌వో లక్ష్మి, అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి కాఫీ ఉద్యానవన అధికారులు జె.లక్ష్మి, ఎస్.మత్స్యరాజు, జె. ఈశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు అప్పలరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో అవగాహన కల్పిస్తున్న కాఫీ సిబ్బంది

గూడెంకొత్తవీధి: కాయతొలుచు పురుగు పై శుక్రవారం వంచుల పంచాయతీ కొత్తపల్లిలో కాఫీ రైతులకు అవగాహన కల్పించారు.కాఫీ లైజర్ వర్కర్ లోతా గంగరాజు,హెచ్‌వో అరుణ కుమారి,ఎఫ్‌సీ మర్రి చిన్నారావు మాట్లాడుతూ వర్షాకాలంలో కాఫీ మొక్కలకు వచ్చే చీడపీడలు, నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఘనంగా తెలుగు భాష,జాతీయ క్రీడా దినోత్సవాలు



ముంచంగిపుట్టులో ఉపాధ్యాయులు శ్రీను, రాంబాబులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



అరకులోయలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు



సీలేరులో గిడుగు రామ్మూర్తి వేషధారణలో విద్యార్థులు

ముంచంగిపుట్టు: స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–2లో తెలుగు భాష,జాతీయ క్రీడా దినోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.గిడుగు రామ్మూర్తి,ధ్యాన్‌చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. స్థానిక తెలుగు అధ్యాపకులు శ్రీనివాసరావు, పీడీ రాంబాబులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా హెచ్‌ఎం బి.శంకరరావు మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి తెలుగు భాషకు చేసిన సేవలు మరవలేనివని, భారత హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యానచంద్ సేవలు చిరస్మరణీయమన్నారు.అనంతరం భాష,క్రీడా దినోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణారావు,బాలకృష్ణ,నాగభూషణ్,దామోదర్‌పాత్రో పాల్గొన్నారు.

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలుగు భాష, జాతీయ క్రీడల దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్ ఆదేశాల మేరకు తెలుగు విభాగం, క్రీడలు విభాగం ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. కొండబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు వై. విజయలక్ష్మి, ఎం. అనితకుమారి, అధ్యాపకులు ఎం. కృష్ణామోహన్, గణేష్, ఎస్. రాజు, లచ్చన్న, కామేశ్వరరావు, భవాని, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: స్థానిక డీఏవీ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఓం నమశ్శివాయ,మూర్తి, నూకరాజు, కమలాకర్ పాల్గొన్నారు. గురుకుల పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బుచ్చిబాబు ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. గిరిజన ఆశ్రమ బాలికల ఆశ్రమ పాఠశాల, దారకొండ తదితర పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



డౌనూరులో గిడుగు రామ్మూర్తి,ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొయ్యూరు: డౌనూరు ఆశ్రమ బాలుర పాఠశాలలో శుక్రవారం తెలుగుభాషా దినోత్సవాన్ని,జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు హెచ్‌ఎం ఎ.వి.రవికుమార్, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయుడు అప్పలకొండ, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.పోతురాజును సన్మానించారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

హుకుంపేట: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో రమాదేవి తెలిపారు. స్థానిక ఎంపీడీవో,ఐసీడీఎస్ కార్యాలయల్లో ఆదికర్మ యోగి అభియాన్‌పై అధికారులకు,సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రజా సమస్యలపై సర్వే చేసి, నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ధ్రువకుమార్,ఎంఈవో సోమెలి చెల్లయ్య,ఈవోపీఆర్డీ ఎస్.రామనాయుడు,ఏవో సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: గ్రామాల్లో ఆదికర్మయోగి అభియాన్ సర్వేలను చేపట్టి ప్రజల సమస్యలపై నివేదికలు తయారు చేయాలని ఎంపీడీవో ప్రసాదరావు సూచించారు.ఎంపీడీవో కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఆది కర్మయోగి అభియాన్ శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు,ఇతర శాఖల సిబ్బంది బాధ్యతగా తీసుకుని సమగ్రంగా సర్వేను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సాయి, ఎంఈవో రాంబాబు,ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా మాస్టర్ ట్రైనీల ఆధ్వర్యంలో గురు, శుక్రవారాలు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ శిక్షణ తరగతులను ఎంపీడీవో వీరభద్రరావు, తహసీల్దార్ రాజ్‌కుమార్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆది కర్మ యోగి శిక్షణ తరగతుల్లోని అంశాలను అధికార్లు, సిబ్బంది తూచా తప్పకుండా పాటించాలన్నారు. మాస్టర్ ట్రైనీలు ఎస్.సింహాచలం, విజయ్‌కుమార్, బాలమణి, సీహెచ్ బాబూరావు పడాల్, నాగశిరీష,సాయికుమార్ మధుసూదనరాజు శిక్షణనిచ్చారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు.



జి.మాడుగులలో శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనీలు



హుకుంపేటలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో రమాదేవి



కొయ్యూరులో మాట్లాడుతున్న జేఈ సాయి

వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయటౌన్: అరకులోయ, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులోని పెదకోడాపల్లి పంచాయతీ బోసారి పిల్లిపుట్టు గ్రామ సమీపంలోని వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పీఆర్ డీఈఈ డి. రవికుమార్‌ను ఆదేశించారు. శుక్రవారం తన నివాసంలో డీఈఈతో భేటీ అయ్యారు. పీఆర్ శాఖ పరిధిలో జరుగుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూరుమూల ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగపడే బోసారి పిల్లి పుట్టు వంతన నిర్మాణానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. స్పందించిన డీఈఈ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించి, అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.



పీఆర్ డీఈఈ రవికుమార్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

పెన్షన్లు రద్దు చేయడమే మేలైన పాలనా..?

జి.మాడుగుల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంటే మేలైన పాలన తెస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీలు గుప్పించి అధికారంలోని వచ్చిన తరువాత ఉన్న పథకాలకే తిలోదకాలు ఇచ్చారని, పెన్షన్లు రద్దు చేశారని ఇదే నా మేలైన పాలనా అని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండం నాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వంజరి సీతారాం నాయుడు ప్రశ్నించారు. వంజరి పంచాయతీ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి నాయకులు లేనిపోని హామీలను గుప్పించి ప్రజలను మోసం చేశారని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమాన్ని, అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టారని తెలిపారు. ప్రభుత్వం పైనా,కూటమి నాయకులపైనా విమర్శలు చేసిన వారిపై దాడులు, కేసులు పెట్టించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక డీఎస్సీ ఏదని, జీవో నంబర్ 3 ఎక్కడ అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ హయాంలో జిల్లాలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రేషన్ సరుకులు ఇంటింటికీ పంపిణీ చేయాలని,రద్దుచేసిన పెన్షన్లు పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు వలసయ్య, బాలయ్యపడాల్ వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మత్స్యకొండంనాయుడు తదితరులు

నేత్రదానం చేయడానికి ముందుకు రావాలి



హుకుంపేటలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

హుకుంపేట: నేత్రదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకురావాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య అన్నారు. 40వ జాతీయ నేత్రదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం హుకుంపేటలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరణానంతరం నేత్రాలను దానం చేయడానికి ముందుకు వస్తే దేశంలో అంధత్వాన్ని నిర్మూలించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపర్‌వైజర్ సాంబశివరావు,సిబ్బంది సదానందం తదితరులు పాల్గొన్నారు.

వినాయకునికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ఎమ్మెల్యే మత్స్యలింగంకు వినాయకుడి చిత్రపటం అందజేస్తున్న గ్రామస్తులు

హుకుంపేట: మండలంలోని కొంతిలిలో జరిగిన వినాయక ఉత్సవాల్లో శుక్రవారం అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పాల్గొని, పూజలు చేశారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు భక్తి మార్గంలో నడవాలన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించి, వినాయకుడి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రేగం రమేష్,శివ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి ఎమ్మెల్యే నివాళి

గూడెంకొత్తవీధి: రింతాడ మాజీ సర్పంచ్ సాగిన రామారావు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఏబులంలో రామారావు మృతదేహంపై ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పూలమాల ఉంచి నివాళి అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌గా రామారావు ప్రజలకు విశేషసేవలు చేశారన్నారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గిరి ప్రసాద్, ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్,కార్యదర్శి చంటిబాబు,యూత్ అధ్యక్షుడు బాబి,లక్కవరపుపేట సర్పంచ్ వీరేంద్ర ప్రసాద్,మాజీ జెడ్పీటీసీ మత్స్యరాజు, నేతలు షేక్ దావీద్,పి లక్ష్మణ్,రైతు విభాగం నియోజకవర్గరర అధ్యక్షుడు రామారావు,యువజన విభాగం అధ్యక్షుడు రమేష్,చింతపల్లి మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణారావు,జి.జోగిరాజు, కె.నారాయణ తదితరులున్నారు.



రామారావు మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

'అధిక ధరలకు గ్యాస్ సిలిండర్ల విక్రయం'

డుంబ్రిగుడ: ఎన్నికల సమయంలో సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చి, మహిళలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పరశురామ్ అన్నారు. ఈ పథకం సక్రమంగా అమలు కావడం లేదని చెప్పారు. అరకు సమీపంలో మండల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం దేవుడెరుగు, అధిక ధరకు గ్యాస్ సిలిండర్లు విక్రయిస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గిరిజన గ్రామాల్లో గ్యాస్ సిలిండర్లను అధిక ధరకు ఏజెన్సీలు విక్రయిస్తున్నాయన్నారు. ఈవిషయమై సబ్ కలెక్టర్ స్పందించి ప్రభుత్వం నిర్ణయించిన ధరకే గ్యాస్ సిలిండర్ అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్‌రావు, గుంటసీమ సర్పంచ్ గుమ్మ నాగేశ్వరరావు, మండల కార్యదర్శులు మఠం శంకర్, హెచ్.బి. రాము నాయుడు, మండల నాయకులు సింహాచలం, నరసింగరావు, రాంప్రసాద్, తుమ్నాథ్, అశోకు, రాందాస్, విజయదశమి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పరశురామ్

సొంత సొమ్ముతో మట్టి రోడ్డు నిర్మాణం


సీలేరు: దారకొండ పంచాయతీ పెట్రాయి గ్రామం నుంచి ఒడిశా వెళ్లే రూట్‌లో సొంత సొమ్ముతో ఆ గ్రామ గిరిజనులు కిలోమీటరు మేర మట్టి రోడ్డు నిర్మించుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ గ్రామ రహదారి పూర్తిగా బురదగా మారి, రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.గ్రామం నుంచి నిత్యావసర సరుకుల కోసం పక్కనే ఉన్న సరిహద్దు గ్రామమైన చిత్రకొండకు నిత్యం 100 కుటుంబాల వారు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాలకు రోడ్డు దెబ్బతినడంతో గ్రామస్తులందరూ కలిసి సొంత సొమ్ముతో కిలోమీటరు వరకు మట్టి రోడ్డు నిర్మించుకున్నారు. తమ గ్రామానికి సీసీ రోడ్డు నిర్మించాలని ఈ సందర్భంగా గ్రామస్తులు కోరారు. చిన్నపాటి వర్షానికి రహదారి పూర్తిగా దెబ్బతింటోందని వారు చెప్పారు. అధికారులు స్పందించి పెట్రాయి గ్రామానికి సీసీ రోడ్డు నిర్మించాలని మాజీ వార్డు సభ్యుడు కొర్ర బలరామ్, దళపతి బుద్ధి, కిముడు రాంబాబు, బుట్టి కోరారు.



పెట్రాయి గ్రామంలో మట్టి రోడ్డు నిర్మిస్తున్న గిరిజనులు

గ్రామాల అభివృద్ధికి చర్యలు

డుంబ్రిగుడ: వికసిత్ భారత్ కార్యక్రమంలో గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో మండలంలోని 36 గ్రామాలకు ఎంపికైనట్టు చెప్పారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రేమ్‌సాగర్